సాక్షి
చిత్తూరు

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



చేతివృత్తులకు చేదోడు

చేతివృత్తులను నమ్ముకున్న వారి కోసం జగనన్న చేదోడు పథకం కింద ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. - 8లో



పిచ్చికుక్క స్వైర విహారం

చిత్తూరు నగరంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసి 81 మందిని కాటు వేసింది. వారందరూ జిల్లా ఆస్పత్రిలో చేరారు. - 8లో



గడ్డివాములకు నిప్పు

రైతు పొలంలో ఏర్పాటు చేసుకున్న గడ్డివాములకు దుండగులు నిప్పుపెట్టడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో తెలియజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. స్పందనలో నమోదయ్యే అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ స్పందన కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. గైర్హాజరైతే శాఖా పరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పోలీసుశాఖలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ జాషువా తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు అందించవచ్చని, ఎలాంటి విషయమైనా నేరుగా తమకు తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

దేశమ్మకు వినాయకుని పట్టువస్త్రాలు



మంత్రులకు ప్రసాదాలు అందిస్తున్న మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): నగిరిలో వెలసిన నేత్ర ప్ర దాయిని దేశమ్మ అమ్మవారికి కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి తరపున పట్టు వస్త్రాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి సమర్పించారు. నగిరిలో నూతనంగా నిర్మించిన దేశమ్మ ఆలయ మహా కుంభాభిషే కం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ చైర్మన్ పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాకుంభాభిషేకానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రి ఆర్కే రోజాను మర్యాద పూర్వకంగా కలిసి కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి తీర్థ ప్రసాదాలు అందించారు.

ముక్కంటికి 108 కలశాల వితరణ



కలశాలు అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయానికి రైల్వేకోడూరుకు చెందిన ఆదర్శ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల అధినేత కంచిరాజు చెంగల్‌రాజు రూ.1.10లక్షల విలువైన 108 కలశాలను వితరణగా అందించారు. ఈ మేరకు ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు అధికారులు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

శక్తిస్వరూపిణికి స్వర్ణాభరణాలు



చైర్మన్‌కు ఆభరణాలు అందిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞానప్రసూనాంబ అమ్మవారికి పట్టణానికి చెందిన ఎంజీ స్వరూప్ దంపతులు రూ.4 లక్షలు విలువైన 70 గ్రాముల బంగారు నుదుటి పట్టీ, ముక్కర, ముక్కుపుడకను వితరణగా అందించారు. ఆభరణాలను ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించారు. జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,158 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,801 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.51 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

వన్నెకుల క్షత్రియుల.. జైత్రయాత్ర

'నలభై ఏళ్ల నిర్లక్ష్యానికి గురిచేశారు. తన రాజకీయ స్వార్థం కోసం మమ్మల్ని కరివేపాకులా వాడుకుని వదిలేశారు. పదవులన్నీ తన సామాజిక వర్గానికే కట్టబెట్టి మాకు మొండి చెయ్యే చూపారు. కష్టాలు పడ్డాం.. నష్టాలు అనుభవించాం.. అవమానాలు ఎదుర్కొన్నాం..' అంటూ వన్నెకుల క్షత్రియులు చంద్రబాబునాయుడిపై విరుచుకుపడ్డారు. సీఎం జగనన్న పుణ్యమా అని ఇప్పుడు తమకు గుర్తింపు లభించిందని సగర్వంగా వెల్లడించారు. పదవులిచ్చి తన పక్కన కూర్చోబెట్టుకుని చరిత్ర సృష్టించారని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో జగనన్న అండతో వన్నెకుల క్షత్రియుల జైత్రయాత్ర కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నమ్మకానికి.. విశ్వాసానికి మారుపేరు పల్లెరెడ్లు

- నలభై ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సామాజిక వర్గం
- ఓట్లతో గద్దెనెక్కిన టీడీపీ వన్నెకుల క్షత్రియులకు గుర్తింపు ఇవ్వలేదు
- కుప్పంలో వన్నెకుల క్షత్రియులను పట్టించుకోని చంద్రబాబు
- శ్రీకాళహస్తిలో గర్జించిన వన్నెకుల క్షత్రియులు

సాక్షి, తిరుపతి/శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో వన్నెకుల క్షత్రియులు గర్జించారు. నలభై ఏళ్లుగా గుర్తింపు, గౌరవం లభించలేదని టీడీపీపై ధ్వజమెత్తారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకే పల్లెరెడ్లకు చట్టసభల్లో స్థానం లభించిందని ఆ సామాజిక వర్గం నేతలు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో ఆదివారం వన్నెకుల క్షత్రియ జైత్రయాత్ర కార్యక్రమం నిర్వహించారు. వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్‌కుమార్, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, వివిధ పదవుల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

పల్లె రెడ్లు నమ్మితే ప్రాణం ఇస్తారు

వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గం వారు నమ్మితే ప్రాణం ఇస్తారని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. నమ్మకానికి, విశ్వాసానికి మారుపేరు పల్లెరెడ్లు అన్నారు. వన్నెకుల సామాజికవర్గం వారికి 40 ఏళ్లుగా గుర్తింపు లేదని గుర్తుచేశారు. సామాన్య కుటుంబానికి చెందిన మోపిదేవి వెంకటరమణను గల్లీ నుంచి ఢిల్లీ వరకు పంపిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని తెలిపారు. అదే చంద్రబాబు రాజ్యసభ సీట్లను తన సామాజికవర్గం వారైన సుజనాచౌదరి తదితరులకు కట్టబెట్టారని గుర్తుచేశారు. చంద్రబాబు రాజ్యసభ సీట్లను అమ్ముకున్నారని విమర్శించారు. కుప్పంలో సామాన్య కుటుంబానికి చెందిన యువకుడు భరత్‌ని ఎమ్మెల్సీని చేసి, ఏకంగా చంద్రబాబుపై పోటీకి దింపి జగనన్న చరిత్ర సృష్టించారన్నారు. ఈ రోజు తన పక్కన కూర్చున్న భరత్ రేపు అసెంబ్లీలో కూర్చోబోతున్నాడని జోస్యం చెప్పారు. డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సేవలను టీడీపీ వారు వాడుకున్నారే తప్ప ఏ రోజూ గుర్తించిన దాఖలాలు లేవన్నారు. అటువంటి వ్యక్తి గురించి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్ 48 గంటల్లో ఎమ్మెల్సీని చేశారని వివరించారు. ఈ విషయాన్ని సిపాయికి చెబితే.. నమ్మలేదన్నారు. 'ఇది నిజమేనా' అని ఆశ్చర్యం వ్యక్తం చేశారని గుర్తుచేశారు. 40 ఏళ్లలో చనిపోయిన కుటుంబానికి ఎవరైనా ఆర్థిక సాయం చేశారా? ముస్లిం కుటుంబాల పిల్లలకు పెళ్లికానుక ఎవరైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. 40 ఏళ్లుగా ఎందుకు రోడ్లు వెయ్యలేదు అని టీడీపీ నేతలను ప్రశ్నించారు. శ్రీకాళహస్తి పట్టణంలో ఎవరైనా ప్రాణాలు కోల్పోతే పూడ్చడానికి శ్మశానం కూడా లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నలభై ఏళ్ల పాలించిన వారు శ్మశానం ఎందుకు ఏర్పాటు చేయలేదని నిలదీశారు. అభివృద్ధి అంటే రోడ్లే కాదు, సంక్షేమం కూడా అభివృద్ధేనని స్పష్టం చేశారు. శ్రీకాళహస్తికి ఏడాదికి ఒకసారి ఖర్జూరం అమ్మేందుకు కొందరు వ్యాపారులు వస్తారని, వారు 15 రోజులు ఉండి వెళ్తారని.. బొజ్జల కుటుంబీకుల గురించి పరోక్షంగా ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో సొంత ఊర్లో వారినైనా పట్టించుకున్నావా? అని ప్రశ్నించారు. అబద్ధాలు చెప్పేవారిని నమ్మొద్దన్నారు. కౌరవులందరూ ఒకపక్క అయితే శ్రీకృష్ణుడు ఒక్కడే ఒకపక్క అని అలా టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం ఒక వైపైతే.. వైఎస్సార్‌సీపీ మాత్రమే ఒకవైపు అని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీనే మన భవిష్యత్తు

వన్నెకుల క్షత్రియ సామాజిక వర్గానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీతోనే భవిష్యత్ అని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. పల్లెరెడ్లు ఒక మెట్టు ఎదిగారంటే సీఎం వైఎస్ జగన్ పుణ్యమేనని స్పష్టం చేశారు. నలభై ఏళ్ల తనను, తన సేవలను వాడుకున్న టీడీపీ ఏనాడూ పిలిచి గౌరవం ఇచ్చిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో మన సామాజిక వర్గం వారిని ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్న నాయకుడు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన గురించి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ద్వారా తెలుసుకుని పిలిచి పదవిని ఇచ్చి గౌరవం తీసుకువచ్చారని తెలిపారు. తనను ఎమ్మెల్సీగా ప్రకటించారని చెబితే నమ్మలేకపోయానని గుర్తుచేశారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. తనకు గాడ్ ఫాదర్ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డే అని స్పష్టం చేశారు.

వన్నెకులాల వారికి సీఎం జగన్ వల్లే గుర్తింపు

కుప్పంలో వన్నెకుల క్షత్రియులను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారని ఎమ్మెల్సీ భరత్‌కుమార్ వివరించారు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి చంద్రమౌళిని గుర్తించి పిలిచి కుప్పం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. తండ్రి మరణించాక తనను పిలిచి పక్కన కూర్చోబెట్టుకుని మనోధైర్యాన్నిచ్చిన నాయకుడు వైఎస్ జగన్ అన్నారు. అంతటితో ఆగకుండా కుప్పం అభ్యర్థిగా ప్రకటించి వన్నెకుల సామాజికవర్గం వారికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. ఏ కులమైనా ఎదగాలంటే అంతో ఇంతో రాజకీయ పదవులు ఉండాలని స్పష్టం చేశారు.



సంఘీభావం తెలుపుతున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణ, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం



సభకు హాజరైన నేతలు, వన్నెకుల క్షత్రియులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం



సభకు తరలివస్తున్న వన్నెకుల క్షత్రియులు

వరసిద్ధునికి వెండి హారతి పళ్లాలు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామికి బెంగళూరుకు చెందిన దాత అరుణ్ కుమార్ కుటుంబసభ్యులు 14 రకాల వెండి హారతి పళ్లాలు వితరణగా అందజేశారు. దాత కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి వద్ద ఎనిమిది కిలోల వెండితో (రూ.7.50లక్షలు) 14 రకాల హారతులను తయారు చేయించి వితరణగా ఇచ్చారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ పాల్గొన్నారు.



ఆలయ చైర్మన్‌కు వెండి హారతి పళ్లాలను ఇస్తున్న దాతలు

మంచి నాయకత్వం అవసరం



టీడీపీ నాయకులకు కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న విజయానందరెడ్డి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ప్రతి విజయం వెనుక మంచి నాయకత్వం ఉంటుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి అన్నారు. స్థానిక పలమనేరు రోడ్డులో ఆదివారం ఆత్మీయ సమా వేశం నిర్వహించి మాట్లాడారు. అందరూ చేతులు కలిపితే ఊరువాడా శుభ్రమవుతాయన్నారు. అలాగే పది మందికి మంచి చేయాలంటే మంచి నాయకత్వంతో కూడిన రాజకీయం అవసరమని చెప్పారు. దీనికి ప్రజల ఆశీస్సులు కూడా ఉండాలన్నారు. కొందరు స్వార్థ రాజకీయ నాయకులు అవసరమైనప్పుడు మాత్రమే కనిపిస్తుంటారని, వారి మాయమాటల్లో పడి మోసపోవద్దని సూచించారు. వచ్చే ఎన్నికల్లో చిత్తూరుకు మేలు చేసే నాయకుడిని, జగనన్న మేలును గుర్తించి ఓట్లు వేయాలని చెప్పారు. అలాగే 36వ డివిజన్‌లో టీడీపీ నుంచి 20 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి విజయానందరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ప్రసాద్, దినేష్ మిత్ర బృందం పాల్గొంది

అంగరంగ వైభవం.. కుంభాభిషేకం

- శాస్త్రోక్తంగా దేశమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ
- నేత్ర ప్రదాయిని క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ
- కనులపండువగా కలశ ఊరేగింపు
- హాజరైన డిప్యూటీ సీఎం, మంత్రులు



నేత్ర ప్రదాయిని ఆలయం వద్ద భక్తజనం



కుంభాభిషేక పూజలో డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రి ఆర్కేరోజా

నగరి : ఆధ్యాత్మిక శోభతో నగరి ఖ్యాతి ఇనుమడించింది. వేదమంత్రోచ్ఛారణల నడుమ నేత్ర ప్రదాయిని దేశమ్మ ఆలయ మహాకుంభాభిషేకం అంగరంగవైభవంగా పరిపూర్ణమైంది. నూతనంగా నిర్మించిన దివ్యాలయంలో దేశమ్మ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో భక్తకోటి పులకించింది. మహాకుంభాభిషేక జలాల జల్లులో తడిసి నగరి పట్టణం పునీతమైంది. ఈ వేడుకలను కాంచిన కనులదే భాగ్యమైంది. మంత్రి ఆర్కేరోజా ఆధ్వర్యంలో నిర్వహించిన మహిమాన్విత ఘట్టంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పాలుపంచుకున్నారు. సర్వాలంకరణతో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు పరవశించిపోయారు. నగరి పట్టణం టీఆర్ కండ్రిగలోని నేత్రప్రదాయిని క్షేత్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మహాకుంభాభిషేక మహోత్సవం చివరిరోజు ఆదివారం దేశమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, వినాయక, సుబ్రమణ్య, నాగాలమ్మ, నవగ్రహాల ప్రతిష్ఠతో ఘనంగా ముగిసింది. మంత్రి ఆర్కే రోజా నేతృత్వంలో అత్యంత వైభవోపేతంగా మహాకుంభాభిషేక మహోత్సవం సాగింది. వేదపండితులు రామకృష్ణ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన వేదపండితులు పాల్గొన్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు వేదపారాయణం, యజ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మంత్రి ఆర్కేరోజా మహిళలతో కలిసి పుదపేట అగరవినాయక స్వామి ఆలయం నుంచి టీటీడీ వారి పట్టువస్త్రాలతోను, కలశాలతోను ఊరేగింపుగా ఆలయానికి చేరుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఆలయంలో పూర్ణాహుతి పూజలనంతరం కుంభాభిషేక సంబంధిత ప్రధాన కలశాన్ని మంగళవాయిద్యాల నడుమ మంత్రి ప్రదక్షిణగా తీసుకువచ్చారు. కుంభాభిషేకంలో పాల్గొనడానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం నారాయణస్వామిని, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆలయ కమిటీతోపాటు మంత్రి స్వాగతించారు. వేదపండితులు విగ్రహ పతిష్ఠ చేసిన అనంతరం గర్భాలయ విమాన శిఖర కలశ స్థాపన చేశారు. శిఖర కలశానికి వేదపండితులతో కలిసి మంత్రులు కుంభాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారి తొలిదర్శనం చేసుకున్నారు. కుంభాభిషేక ఉత్సవాలకు పదివేలకు పైగా భక్తులు రావడంతో ఆలయ పరివారంతో పాటు రోడ్డంతా జనంతో నిండిపోయింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

రూ.1,400 కోట్లతో ఆలయాల అభివృద్ధి

రాష్ట్ర వ్యాప్తంగా రూ.1,400 కోట్లతో ఆలయాలు అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం నారాయణ స్వామి అన్నారు. నేత్రప్రదాయిని దేశమ్మ ఆలయ మహాకుంభాభిషేక వేడుకల్లో వారు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సీజీఎఫ్ నిధులతో మంత్రి ఆర్కేరోజా ఆలయాన్ని నిర్మించారన్నారు. అమ్మవారి అనుగ్రహంతోనే ఆలయ నిర్మాణం చేసినట్లు పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. దేశమ్మ తల్లికి నూతన ఆలయం నిర్మించాలన్నది తన కల అన్నారు.

అమెరికా నుంచి కుంభాభిషేకానికి..

అమెరికా నుంచి అమ్మవారి దర్శనానికి క్రిష్టోఫర్ టింపరోలి విచ్చేయడం ప్రత్యేకత సంతరించుకుంది. దీంతో అమ్మవారి మహిమ ఖండాంతరాలు దాటిందంటూ భక్తులు చర్చించుకున్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా విరాళాలు అందించిన దాతలతోపాటు ఆయన ఆలయానికి విచ్చేశారు. ఈయన అమెరికాలో సింగర్‌గా, రచయితగా, నటుడుగా గుర్తింపు పొందారు. మిస్టరీ ఆఫ్ సౌండ్, విశ్వవినాయక్ అనే ఆల్బమ్‌లు విడుదల చేసి ప్రాచుర్యం పొందడంతో పాటు పలు చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం షారుక్‌ఖాన్‌తో ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఆయనతో పాటు ఫిల్మ్ మేకర్స్ రమేష్, దండపాణి, ప్రభు కూడా అమ్మవారి దర్శనార్థం విచ్చేశారు.



ఆలయంలో క్రిస్టోఫర్, ఫిల్మ్‌మేకర్స్

క్లుప్తంగా

ఎన్నికలకు సమాయత్తం


మాట్లాడుతున్న ఎస్పీ జాషువా

చిత్తూరు అర్బన్: ఎన్నికల విధులకు పోలీసు అధికారులు సమాయత్తమవ్వాలని ఎస్పీ జాషువా అన్నారు. నగరంలోని పోలీసు అతిథి గృహంలో ఆదివారం జిల్లా పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, పోలీసు శాఖలో విభేదాలు ఉండకూడదన్నారు. కుల, మతాలకు అతీతంగా పోలీసు సేవలను అందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అక్రమ మద్యం, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్ పోస్టులను మరింత పటిష్టం చేయాలన్నారు. ఎన్నికల సమయంలో లా అండ్ ఆర్డర్ చాలా సున్నితంగా ఉంటుందని పేర్కొన్నారు. నైట్ బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. రాత్రి సమయాల్లో కూడా వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. విధుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అరీపుల్లా, సుబ్బరాజు, డీఎస్పీలు పాల్గొన్నారు.


ఏఆర్ఓలకు ఎన్నికల శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల విధులపై ఏఆర్ఓలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 12 నుంచి 16 వరకు 105 మంది, 19 నుంచి 23 వరకు 99 మంది, 26 నుంచి మార్చి 1 వరకు 103 మంది మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. తిరుపతి జిల్లా కేంద్రంలోని పద్మావతి మహిళా యూనివర్సిటీలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఏఆర్ఓలు పాల్గొననున్నారు.

పెరిగిన అక్షరాస్యత.. విస్తరించిన ఉద్యోగావకాశాలు..మారిన బతుకులు.. అయినా నేటికీ ఎంతో మంది కులవృత్తులపైనే జీవనం.. చాలీచాలని సంపాదన.. ఫలితంగా దారిద్ర్యరేఖకు దిగువనే ఆ కుటుంబాలు.. ఈ విషయం గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఆర్థిక చేయూతనిచ్చి, అండగా నిలవాలని సంకల్పించారు. చేతి వృత్తులనే నమ్ముకున్న వారి కోసం జగనన్న చేదోడు పథకం అమలు చేసి, వారికి చేదోడుగా నిలిచారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



జగనన్న చేదోడు మెగా చెక్కును కులవృత్తులవారికి అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)



జగనన్న చేదోడు వివరాలివీ..

మండలం	లబ్ధిదారుల సంఖ్య
పలమనేరు	94
పలమనేరు మున్సిపాలిటీ	195
వెంకటగిరికోట	534
బైరెడ్డిపల్లె	321
గంగవరం	221
పెద్దపంజాణి	368
మొత్తం	1,733

చేతివృత్తులకు చేదోడు

- ఏటా 1,733 మందికి ఆర్థిక సాయం
- ఆర్థికంగా నిలదొక్కుకున్న చేతివృత్తుల కుటుంబాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పలమనేరు: సమాజంలో కులవృత్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వారికి అండగా నిలవాలనే సంకల్పంతో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం అమలు చేశారు. దీంతో పలమనేరు నియోజకవర్గంలోని రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ(టైలర్లు) అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏటా అక్టోబరునెలలో రూ.10వేల ఆర్థికసాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.69.32 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ నగదుతో వారి కుటుంబాల్లో వెలుగులు నిండాయి. దీంతో తమకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏటా కొత్త దరఖాస్తులు

జిల్లాలో ఇప్పటివరకు 8 వేల మంది వరకు లబ్ధిదారులున్నారు. నాలుగో ఏడాదిలో కొత్తగా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందినవారు 1100 మంది వరకు ఉన్నారు. 21–60 ఏళ్ల మధ్య వయస్సున్న వారు ప్రభుత్వం నిర్దేశించిన ధ్రువపత్రాలను సచివాలయాల ద్వారా అందించి ఈ పథకాన్ని పొందుతున్నారు. ఏటా ఇందుకు సంబంధించి సచివాలయ సిబ్బంది వెరిఫికేషన్ చేస్తూ ఈ పథకాన్ని పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నారు.

మా కుటుంబానికి చేదోడే



టైలరింగ్ పనులు చేసుకుని బతికేవాళ్లం. కోవిడ్ సమయంలో పనులు లేకుండా పోయాయి. ఆ సమయంలో ఏమి చేయాలో అర్థం కాలేదు. కానీ ఏటా జగనన్న ప్రభుత్వం నుంచి వచ్చే రూ.10 వేలు మా కుటుంబానికి అండగా నిలచింది. ఆ పథకం మా లాంటి వారికి చేదోడే. ఆయన చేస్తున్న మేలును ఎన్నటికీ మరువలేం.

– రామక్రిష్ణ, టైలర్, వి.కోట

దుకాణ అభివృద్ధికి..



నేను వి.కోటలో హెయిర్‌కటింగ్‌షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న చేదోడు ద్వారా ఏటా అందే రూ.10 వేలతో దుకాణాన్ని అభివృద్ధికి వాడుకుంటున్నా. కోవిడ్ సమయంలో ఆర్థికంగా ఇబ్బందులు పడినా ఇప్పుడు వ్యాపారం బాగుంది. మాలాంటి కులవృత్తుల వారికి చేదోడు అండగా ఉంది.

– మోహన్‌బాబు, సెలూన్‌షాపు, వి.కోట

పెట్టుబడికి వాడుకున్నా..



నేను పదేళ్లుగా టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మాకు పండుగ వేళల్లో పనులు ఎక్కుగా ఉండి, కొన్ని సార్లు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి వస్తుంది. టైలర్లకు ఆర్థికసాయం చేయాలనే ఆలోచన గతంలో ఏ ప్రభుత్వానికి రాలేదు. కానీ మాలాంటి వారి కష్టాలను చూసి జగనన్న చేదోడు ద్వారా ఆదుకోవడంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పోయింది.

– గార్గేయ, టైలర్, రాయలపేట, పెద్దపంజాణి మండలం

ఇస్త్రీపెట్టె కొనుక్కున్నా..



మేము రజకవృత్తితో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ప్రతి ఇంట్లో ఎలక్ట్రికల్ ఐరన్ బాక్సులు రావడంతో మాకు పెద్దగా పని దొరకడం లేదు. ఇలాంటి సమయంలో జగనన్న చేదోడు ద్వారా ఏటా రూ.10 వేల ఆర్థికసాయంతో ఇబ్బందులు తప్పుతున్నాయి. ఇంతకుముందు ఇచ్చిన నగదుతో టేబుల్, ఇస్త్రీ పెట్టె కొనుక్కున్నా. ఇప్పుడు ఏ ఇబ్బంది లేకుండా పని చేసుకుంటున్నా.

– హేమచంద్ర, దోబీ, రాయలపేట, పెద్దపంజాణి మండలం

ధైర్యాన్నిచ్చింది



నేను సెలూన్ షాపు నడుపుకుంటున్నాను. ఏటా జగనన్న చేదోడు నగదు అందడంతో షాపునకు కావాల్సిన పరికరాలను కొనుగోలు చేసుకుని ఎలాంటి ఇబ్బంది లేకుండా షాపును అభివృద్ధి చేసుకుంటున్నా. మాలాంటి కులవృత్తులు బాగుండాలని ఈ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహానికి జగనన్నకు రుణపడి ఉంటాం.

–ప్రతాప్,పొన్నుమాకులపల్లి, గంగవరం మండలం

ముడి సరుకుల కొనుగోలుకు..



నేను 30 ఏళ్లుగా టైలరింగ్ చేస్తున్నా. నాకు ఐదుగురు పిల్లలు. వీరందరికీ విద్య, కుటుంబపోషణకు చాలా ఇబ్బందిగా ఉండేది. కరోనా సమయంలో ఖాళీగానే ఉండాల్సి వచ్చింది. అయితే నాలుగేళ్లుగా జగన్న ధర్మాన రూ.10 వేలు నా అకౌంట్‌లోకి పడుతోంది. ఆ డబ్బుతో నూలు, సూదులు తదితర ముడి సరుకులు కొనుగోలు చేసి, పనులు చేసుకుని, నా కుటుంబాన్ని పోషించుకుంటున్నా.

–గంగాధర, టైలర్, కల్లుపల్లి, గంగవరం మండలం

నా కష్టాలు తీర్చింది



నేను బైరెడ్డిపల్లెలో సెలూన్ దుకాణాన్ని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురై ఇంటికే పరిమితమయ్యా. ఆ సమయంలో జగనన్న చేదోడు నా కష్టాలను తీర్చింది. నా జీవితం ఉండే వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరువను. ఆయనకే మా కుటుంబ సభ్యులందరం ఓటేస్తాం.

– సుధాకర్, సెలూన్, బైరెడ్డిపల్లె

భరోసానిస్తోంది



నేను పదేళ్లుగా టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నాను. రెడీమేడ్ దెబ్బకు వ్యాపారం తగ్గింది. ఇలాంటి సమయంలో దర్జీలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న ఆర్థికసాయం మాకు ఎంతో భరోసా నిచ్చింది. మా కుటుంబాల ఆర్థిక పరిస్థితికి అండగా నిలిచింది. మాలాంటి వారికి సాయం చేస్తున్న జగనన్నకు నిజంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా.

– జోహర్, టైలర్, బైరెడ్డిపల్లె

మూగ మహిళపై అత్యాచారం

శ్రీరంగరాజపురం: మూగ మహిళపై అత్యాచారం చేసిన సంఘటన మండలంలోని ఓ ఎస్టీ కాలనీలో వెలుగుచూసింది. స్థానికుల, పోలీసుల తెలిపిన వివరాల మేరకు, ఎస్టీ కాలనీకి చెందిన మూగ మహిళ ఇంట్లో శనివారం రాత్రి 10 గంటల సమయంలో నిద్రిస్తోంది. జంగాలపల్లి గ్రామం వద్ద నీరజాక్షుల నాయుడుకు చెందిన కోళ్ల ఫారంలో బిహార్‌కు చెందిన ఇద్దరు బాలురు (16) పనిచేస్తున్నారు. వీరు అదే సమయానికి అటువైపు వెళుతూ మూగ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారు. స్థానికులు కేకలు వేయడంతో ఇద్దరూ పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జ్ ఏఎస్ఐ వెంకటేశులు తెలిపారు.

పరస్పరం ఫిర్యాదులు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శాంతిపురం: సోషల్ మీడియా వేదికగా ఇద్దరు వ్యక్తుల మధ్య సాగిన మాటల యుద్ధంపై అధికార, విపక్షాలు ఆదివారం రాళ్లబూదుగూరు ఎస్ఐ సుమన్‌కు ఫిర్యాదులు చేశాయి. గత మంగళవారం మండల టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేత కేశవులు ఎమ్మెల్సీ భరత్‌పై విమర్శలు చేశారు. దీనిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ప్రతిగా కేశవులు మరి కొందరితో కలిసి కడపల్లిలో మీడియా సమావేశం నిర్వహించారు. దీనిని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన స్థానిక కార్యకర్త గోవిందన్ ఓ సెల్ఫీ వీడియోను వాట్సప్‌లో పెట్టారు. ఈ క్రమంలో వ్యక్తిగత దూర్భాషలాడిన గోవిందన్‌పై చర్యలు తీసుకోవాలని టీడీపీ వర్గీయులు ఫిర్యాదు చేశారు. అయితే ప్రశాంతంగా ఉన్న కడపల్లికి ఎక్కడి నుంచో వచ్చి అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన ధనుంజయ

ఐరాల: మండలంలోని జాతీయరహదారిపై కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బంధువుల కథనం మేరకు, మండలానికి చెందిన ధనుంజయ(50) పొలకలలో పశుసంవర్ధక శాఖలో సహాయక వైద్యుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి తన సొంత పనుల నిమిత్తం చిత్తూరుకి బయలుదేరారు. తిరువణంపల్లె వద్ద హైవే వైపు వెళుతుండగా యాదమరి నుంచి కడప వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ధనుంజయ అక్కడికక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. ఈ విషయంపై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గడ్డి వాములకు నిప్పు


బూడిదైన గడ్డి వాములు

గుడుపల్లె: రైతు నిల్వ ఉంచిన గడ్డి వాములకు దుండగులు నిప్పుపెట్టిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. మండలంలోని గుడిచెంబగిరి గ్రామంలోని శ్రీనివాసులు పాడి పశువుల కోసం తన పొలంలో రెండు గడ్డి వాములు ఏర్పాటు చేసుకున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్నం గడ్డివాములు మంటల్లో కాలిపోయాయి. పొలం వద్దకు వెళ్లి చూసే సారికి పూర్తిగా బుడిద అయిపోయినట్లు రైతులు వాపోయాడు. ఈ పశుగ్రాసాన్ని నమ్ముకుని నాలుగు పాడి ఆవులను పెంచుతూ జీవనం సాగిస్తున్నట్టు పేర్కొన్నాడు.

లారీ ఢీకొని మహిళ మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ట్రాఫిక్ సీఐ నిత్య బాబు కథనం మేరకు, గంగాసాగర్ వద్ద చంద్రమ్మ తన ఇంటి బయట కూర్చుని ఉన్నారు. వేలూరు వైపు వెళుతున్న ఓ లారీ వెళ్లి మహిళను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరులో పిచ్చికుక్క స్వైర విహారం

- 81 మందిని కాటేసిన వైనం
- జిల్లా ఆస్పత్రిలో బాధితులకు వైద్యం
- బాధితులకు కమిషనర్ పరామర్శ



కుక్కను పట్టుకున్న నగరపాలక సంస్థ అధికారులు, కుక్కకాటు బాధితులను ఆస్పత్రిలో పరామర్శిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. నగరంలోని తోటపాళెం పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఏకంగా 81 మందిపై ఆ కుక్క దాడికి పాల్పడింది. రెండేళ్ల చిన్నారి నుంచి 65 ఏళ్ల వృద్ధుడి వరకు 81 మందిని వరుస పెట్టి కరవడంతో గాయాలైన బాధితులు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు తీశారు. ఒకే ఒక కుక్క రోడ్డుపై కనిపించిన వారందరినీ కొరుకుతుండడంతో ఓ దశలో ప్రజలంతా భయభ్రాంతులకు గురై ఇళ్లలోకి వెళ్లి తలుపులు వేసుకున్నారు. తోటపాళ్యం, పీహెచ్ వాడ, కట్టమంచి, ఎంఎస్ఆర్ కూడలి, మిట్టూరు ప్రాంతాల్లోని జనంపై పిచ్చికుక్క దాడి చేసింది. సమాచారం అందుకున్న కార్పొరేషన్ అధికారులు కుక్కను పట్టుకుని షెడ్డులో బంధించారు. సోమవారం పశు వైద్యశాలకు తరలించనున్నట్లు తెలిపారు. బాధితులకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందించారు. మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని బాధితులు వాపోయారు. బాధితులను కమిషనర్ అరుణ పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు. వీధి కుక్కల నియంత్రణకు కార్పొరేషన్ అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వెల్లడించారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

చిత్తూరు రూరల్: కుక్క కాటుతో గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశించారు. కుక్కల దాడిలో గాయపడిన వారు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించారు. దీంతో మధ్యాహ్నం నుంచి ఒకరి వెంట మరొకరు క్యూకట్టడంతో ఆస్పత్రి వైద్యులు అప్రమత్తమయ్యారు. సాయంత్రం వరకు ఈ కేసులు నమోదయ్యాయి. దీంతో అత్యవసర విభాగం బాధితులు, వారి సహాయకులతో కిటకిటలాడింది. వెంటనే ఆస్పత్రి అధికారులు స్పందించారు. వారికి టీకాలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి సిబ్బందితో కుక్కకాటు బాధితుల వివరాలను తెలుసుకుని గాయపడిన వారిని పరామర్శించారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.